క్లుప్తంగా

రామాలయ పునఃనిర్మాణ ప్రతిష్టకు ఏర్పాట్లు



తాడేపల్లి రూరల్: నగర పరిధిలోని ఉండవల్లి రెడ్ల బజార్‌లో గల రెడ్ల రామ మందిరం పునఃనిర్మాణానికి కమిటీ ప్రతినిధులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామ మందిరం నిర్మించి వంద ఏళ్లు దాటిందని కమిటీ ప్రతినిధులు తెలిపారు. రోడ్డు కిందకు గుడి ఉడడంతో పునఃనిర్మించాలని.. పాత మందిరం తొలగింపునకు ప్రత్యేక పూజలు నిర్వహించామని అన్నారు. త్వరలోనే నూతన ఆలయ నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



ఫిరంగిపురం: ద్విచక్రవాహనంపై వెళుతున్న దంపతులను వెనక నుంచి లారీ ఢీకొనడంతో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని రేపూడి గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా, నరసరావుపేటలోని షాలెం నగర్‌కు చెందిన రవికుమార్, రాజమణి దంపతులు ఉద్యోగ రీత్యా గుంటూరులో నివాసం ఉంటున్నారు. కాగా రాజమణి(45) తాడికొండ మండలం మోతడకలో డిప్యుటేషన్‌పై ఏఎన్‌ఎంగా పనిచేస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి నరసరావుపేట నుంచి గుంటూరుకు ఇరువురు ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం వెళ్లి వస్తుండగా రేపూడి గ్రామశివారులో లారీ ఢీకొంది. దీంతో మహిళ అక్కడికక్కడే మృతిచెందారు. భర్త రవి కుమార్‌కు గాయాలయ్యాయి. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని.. గుంటూరు జీజీహెచ్‌లో మృతదేహానికి శవపంచనామా నిర్వహించినట్లు ఎస్‌ఐ శివరామకృష్ణ తెలిపారు. మృతురాలికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు అభినందనీయం

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



తెనాలిఅర్బన్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మహాప్రస్థానం సేవా సమితి కార్యదర్శి జెట్టి శివరామకృష్ణప్రసాద్ సహకారంతో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, జానీ, ప్రవీణ్, గిరీష్, సాయి, పాపయ్య చౌదరి, పోతురాజు, చంటి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన డైనమిక్ కిడ్స్ క్యాంప్

తెనాలిఅర్బన్: జీసస్ కాల్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో చెంచుపేటలోని ప్రెయర్ టవర్‌లో జరుగుతున్న డైనమిక్ కిడ్స్ క్యాంప్ గురువారంతో ముగిసింది. చిన్నారులకు బైబిల్ వాఖ్యాల కంఠస్థం, క్రైస్తవ పాటలు, సంగీతం వంటి పోటీలను నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి తెనాలి ప్రతినిధి కాంద్రు ప్రకాష్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో టీచర్స్ సిహెచ్ శాంత కుమారి, ఎస్ పెర్సిస్ సౌందర్య రాణి తదితరులు పాల్గొన్నారు.

రైలులో ల్యాప్‌టాప్ బ్యాగు మర్చిపోయిన ప్రయాణికుడు

తిరిగి అప్పగించిన జీఆర్పీ పోలీసులు

తెనాలిరూరల్: రైలులో ప్రయాణికుడు ల్యాప్‌టాప్ బ్యాగును మర్చిపోయాడు. జీఆర్పీ పోలీసులను ఆశ్రయించగా గురువారం అందజేశారు. పట్టణానికి చెందిన యాకూబ్‌బాషా తన కుటుంబంతో కలసి హైదరాబాద్ వెళ్లి బుధవారం రాత్రి తిరిగి వచ్చాడు. గుంటూరులో రైలు దిగి తెనాలి వచ్చేందుకు గుంటూరు–రేపల్లె ప్యాసింజర్ రైలు ఎక్కారు. రైలులో ల్యాప్‌టాప్ ఉన్న బ్యాగును మర్చిపోయి తెనాలిలో దిగిపోయాడు. గ్రహించి వెంటనే జీఆర్పీ పోలీసులను ఆశ్రయించగా పోలీసులు రేపల్లె ఔట్‌పోస్ట్ సిబ్బందికి సమాచారమిచ్చి బ్యాగును గుర్తించి గురువారం యాకూబ్‌బాషాకు అప్పగించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి: స్థానిక గాంధీనగర్‌లోని షిరిడీ సాయి వృద్ధాశ్రమంలో గురువారం శ్రీవెంకటేశ్వర యోగ సేవాకేంద్రం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. యోగ సభ్యుడు వంగర మాధవరావు 56వ జయంతి సందర్భంగా ఈ సేవాకార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా ఎస్వీ యోగ కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య మాట్లాడుతూ.. యోగ సభ్యులు జరుపుకొనే శుభకార్యాలకు ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేయాలని సూచించారు. వంగర జగదీశ్వరి, సోమరౌతు ఏసుబాబు, ఎం.సాయికృష్ణ, ప్రధానోపాధ్యాయుడు కుర్రా శ్రీనివాసరావు, ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ, సునీత, యోగసాధకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం

ప్రపంచ కార్మిక దినోత్సవ మే డే వేడుకలను నగర పరిధిలోని పలు చోట్ల గురువారం ఘనంగా నిర్వహించారు. పలు పార్టీ, ప్రభుత్వ, యూనియన్ కార్యాలయాల్లో నిర్వహించిన ఈ వేడుకలకు స్థానిక నాయకులు, అధికారులు హాజరయ్యారు. మే డే విశిష్టతను వివరించారు. జెండా ఆవిష్కరణలు, బైక్ ర్యాలీలు నిర్వహించి మేడే నినాదాలు చేశారు. కార్మికులు పోరాడి సాధించిన హక్కులను గుర్తు చేసుకున్నారు.



వైఎస్సార్ సీపీ కార్యాలయం వేడుకల్లో నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: కార్మికుల పోరాటం, ఐక్యతలకు చిహ్నమే మే డే అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు తెలిపారు. మే డే సందర్భంగా గురువారం నగర పరిధిలోని ఆత్మకూరు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం వేడుకలకు ఇరువురూ హాజరయ్యి జెండాను ఎగురవేశారు. నియోజకవర్గ వైఎస్సార్ టి.యు.సి అధ్యక్షుడు రత్నాకరం శ్రీనివాసరాజు అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా యాక్టివిటి కార్యదర్శి మల్లవరపు సుధారాణి, మండల అధ్యక్షుడు నాలి వెంకటకృష్ణ, యువజన విభాగం అధ్యక్షుడు సయ్యద్ గౌస్ మొహిద్దీన్, బీసీ విభాగం అధ్యక్షుడు తాడిబోయిన సుబ్బారావు, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు ఈపూరి ఆదాం, ప్రచార కమిటీ విభాగం అధ్యక్షుడు తిరుమలశెట్టి సురేంద్ర, ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షుడు జంగా నాగిరెడ్డి, గాదె సుబ్బారెడ్డి, మాదాల గోపి, ఉదారపు గోపీనాథ్, కుంచాల కృష్ణ కిషోర్, వల్లంశెట్టి విజయ్, ఆంజనేయులు, సర్దార్, కలకోటి చక్రి, కర్ర జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: మే డే వేడుకలును దుగ్గిరాలలోని రైలుపేట, తుమ్మపూడి, మంచికలపూడి, చిలువూరు గ్రామాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు.



పేరేచర్ల కార్యక్రమంలో పలు కార్మిక సంఘాల నాయకులు

దుగ్గిరాల రైలుపేటలో పసుపు కార్మికులు ఆధ్వర్యంలో సి.ఐ.టి.యు జెండాని సీనియర్ నాయకులు శబల.వేంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులుగా సి.పి.ఎం జిల్లా అధ్యక్షులు ఈమని అప్పారావు హాజరయ్యారు. కార్యక్రమంలో జి.శ్రీనివాసరావు, వి.యోగేశ్వరరావు, జి.ప్రసాద్, కె.శంకర్, కె.నరసంహారావు, పి.సుబ్బారావు, జి.గోపి,



నులకపేట కార్యక్రమంలో నాయకులు

డి.అంకమ్మ, ఎం.శివనాగకుమార్, బి.ఎల్లయ్య పాల్గొన్నారు.

మేడికొండూరు: పేరేచర్ల, నీకో మిల్లు, మేడికొండూరు, సిరిపురం ప్రాంతాల్లో మే డే వేడుకలను నిర్వహించి జెండాను ఎగురవేశారు. కార్యక్రమాల్లో జిల్లా నాయకులు బి.శ్రీనివాసరావు, బి.రామకృష్ణ, షేక్ బాషా, యమ్ సాథిక్, భవన నిర్మాణ.కార్మికులు, పంచాయతీ వర్క్స్, నికో కార్మికులు, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: పట్టణంలోని నులకపేటలో మంగళగిరి ఏరియా ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మే డే నిర్వహించారు. యూనియన్ నాయకుడు జి.శ్రీను జెండాను ఆవిష్కరించారు. యూనియన్ కార్యాలయం వద్ద గౌరవ అధ్యక్షుడు బి.కొండారెడ్డి అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.కె ఖాసిం, అజయ్ బాబు, ఎస్.కె నస్రీద్దున్ తదితరులు పాల్గొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు ఏర్పడిందే మే డే అని సి.ఐ.టి.యు గుంటూరు జిల్లా నాయకులు వై.నేతాజీ అన్నారు. ఎం.టి.ఎం.సి పరిధిలోని కుంచనపల్లిలో జరిగిన వేడుకల్లో పాల్గొని ఆయన అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు జొన్నా శివశంకర్, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కాజా శ్రీనివాసరావు, చుక్కా మరియదాసు, కె.శ్యామల, కె.భారతిలక్ష్మి, అమ్మిశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు. ఉండవల్లిలో సి.పి.ఎం, సి.ఐ.టి.యు ఆధ్వర్యంలో జరిగిన మే డే వేడుకల్లో నాయకులు ఎం.రవి, ఈమని రామారావు, టి.బక్కిరెడ్డి, వల్లభాపురం వెంకటేశ్వరరావు, ఎస్.ఇమ్మానుయేలు, కె.జగదీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరు(మంగళగిరి): నగర పరిధిలోని ఆత్మకూరు, పెదవడ్లపూడిలో ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు. ఆత్మకూరులో మే డే పతాకాన్ని పంతగాని మరియదాసు ఆవిష్కరించారు. జెండా చెట్టు సెంటర్‌లో అరుణ పతాకాన్ని గజవల్లి వెంకటకృష్ణ ఎగుర వేశారు. పలు కార్యక్రమాల్లో సయ్యద్ కరీముల్లా, జాన్‌సైదా, జువ్వాది సాంబశివరావు సింహాద్రి వెంకటేశ్వరరావు, జాలాది జాన్‌బాబు, కాబోతు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి: పట్టణంలో 27 సెంటర్లలో జరిగిన మే డే వేడుకల్లో సి.పి.ఎం నాయకులు పాశం రామారావు, వి.వి.జవహర్‌లాల్, ఎస్.ఎస్.చెంగయ్య, జేవీ రాఘవులు, పి.బాలకృష్ణ, ఎం.బాలాజీ, వై.కమలాకర్ పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరణలో నాయకులు

తాడికొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాల రాస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పచ్చల సాంబశివరావు పేర్కొన్నారు. పొన్నెకల్లు, తాడికొండలో నిర్వహించిన మేడే వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. పొన్నెకల్లులోని పలు చోట్ల వేడుకలను నిర్వహించారు. నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకర్ రావు, రేపూడి శ్రీనివాసరావు, నూతక్కి రాము, దానినేని పద్మారావు, తాడిపోయిన రవి, సీపీఎం నాయకులు ఎడ్లపల్లి గాంధీ రామ్మోహన్రావు, చింతల భాస్కర రావు, కె.పూర్ణయ్య, నూతక్కి వీరయ్య కార్మికులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్‌లో

తాడేపల్లి రూరల్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో మే డే వేడుకలు ఘనంగా జరిగాయి. సీపీఐ పార్టీ కార్యాలయంలో సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య జెండాను ఎగురవేశారు. సహాయ కార్యదర్శి ముసునూరి సుహాస్, సీనియర్ నాయకులు గుంటక సాంబిరెడ్డి, మానికొండ డాంగే, కంచర్ల కాశయ్య, జి.శివ, దొంతా కోటేశ్వరరావు, కాశీమ్, బాషా, ప్రసాద్, రాజు, ఎస్.లక్ష్మణ్, లక్ష్మీ తిరుపతమ్మ, గౌరీ తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లి సీపీఐ కార్యాలయ వేడుకల్లో సీపీఐ నాయకులు

వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసన



దుగ్గిరాల: వక్ఫ్ సవరణ చట్టం 2025కి వ్యతిరేకంగా ముస్లింలు తమ గృహాలు, వాణిజ్య సముదాల వద్దగురువారం రాత్రి దీపాల వెలుగులు లేకుండా నిరసన తెలిపారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి నాయకుడు షేక్.సుభాని మాట్లాడుతూ.. రాజ్యాంగం ముస్లింలకు ప్రసాదించిన హక్కులను వక్ఫ్ సవరణ బిల్లుతో కుట్ర జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. షేక్.జాన్ షైదా, మహబూబ్ సుభాని, షేక్.జిలానీ, షేక్.కౌనేన్, మస్తాన్ వలీ, కార్యక్రమంలో పాల్గొన్నారు.

రెండు బస్సులు ఢీ కేసు నమోదు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ రెండు బస్సులు ఢీకొన్న సంఘటన మండలంలోని వేజండ్ల అడ్డరోడ్డు సమీపంలో గురువారం చోటుచేసుకుంది. తెనాలి డిపోకి చెందిన ఆర్‌టీసీ బస్సు ప్రయాణికులను ఎక్కించుకోవడానికి రోడ్డు పక్కన నిలిపారు. అదే సమయంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో ముందు ఉన్న ఆర్‌టీసీ బస్సును ఢీ కొంది. ఘటనలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు

గుంటూరు రూరల్: అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తమ కుమారుడిని ఎత్తుకెళ్లారన్న తల్లి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. తురకపాలెం గ్రామంలో ఓ మహిళకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడితో స్థానిక సత్రంలో బుధవారం రాత్రి నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు బాలుడిని ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

డ్వాక్రా సంఘ సభ్యులపై ఒత్తిడి

- ప్రధాని సభకు రాకపోతే రుణాలు నిలిపివేస్తామని హెచ్చరిక
- అధికారులపై పెరిగిన టీడీపీ, జనసేన నాయకుల ఒత్తిడి
- తెనాలి నియోజకవర్గం నుంచి బయలుదేరనున్న 302 బస్సులు

తెనాలిఅర్బన్: ప్రధాని మోదీ పర్యటన డ్వాక్రా సంఘాలకు కష్టాలు తెచ్చిపెట్టింది. గ్రూప్‌కు కనీసం అయిదుగురు తగ్గకుండా రావాలంటూ ఉన్నతాధికారులు హుకుం జారీ చేశారు. సభ్యులను సమీకరించే బాధ్యతలను కమ్యూనిటీ ఆఫీసర్‌లు, రిసోర్స్ పర్సన్‌లు, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్‌లు, యానిమేటర్‌లకు అప్పగించారు. దీంతో వారు వారం నుంచి సమీకరణ పనుల్లో నిమగ్నమయ్యారు. ఎవరైన విముఖత చూపితే వారికి రుణాలు నిలిపివేస్తామంటూ బెదిరిపులకు పాల్పడుతున్నారు. చేసేదిలేక సభ్యులు శుక్రవారం రాజధాని అమరావతి వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు.

రాజధాని పునఃనిర్మాణ పనులు పుఃన ప్రారంభించేందుకు శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ అమరావతి వస్తున్నారు. సభకు అయిదు లక్షలు ప్రజలు వచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా తెనాలి నియోజకవర్గ పరిధిలోని సుమారు అయిదు వేలకుపైగా డ్వాక్రా గ్రూప్‌లు ఉన్నాయి. తెనాలికి అమరావతి సమీపంగా ఉండటంతో 15 వేల మందిని ఇక్కడి నుంచి తరలించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో పట్టణ పరిధిలోని డ్రాక్రా సీవోలు, ఆర్‌పీలు, మండల పరిధిలో ఏపీఎం, సీసీ, యానిమేటర్‌లకు అప్పగించారు. దీంతో వారు వారం నుంచి డ్వాక్రా సంఘ సభ్యులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సభ్యులను సమాయత్తం చేశారు.

తెనాలి నుంచి 302 బస్సులు

తెనాలి పట్టణం, కొల్లిపర, తెనాలి మండల పరిధిలో జన సమీకరణ జరిపేందుకు అధికారులు 302 బస్సులు ఏర్పాటు చేశారు. ఇవి శుక్రవారం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య ఆయా వార్డులు, గ్రామాలకు రానున్నాయి. వాటిలో డ్వాక్రా సంఘాలకు కేటాయించిన బస్సులలో కనీసం గ్రూప్‌కు కనీసం ముగ్గురు తగ్గకుండా ఎక్కించేలా చర్యలు తీసుకుంటున్నారు. తెనాలి పట్టణ పరిధిలో డ్వాక్రా మహిళల కోసం 42, మండల పరిధిలో26, కొల్లిపర పరిధిలో 46 బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. వీటిలో బస్సుకు 50 మంది చొప్పున ఎక్కించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సభ్యులను ఎక్కించే బాధ్యత డ్వాక్రా అధికారులతో పాటు సచివాలయ అడ్మిన్‌లు, గ్రామ కార్యదర్శులు, వెల్ఫేర్ సెక్రెటరీలకు అప్పగించారు. వీరు బస్సు రాగానే సభ్యులను ఎక్కించనున్నారు. వీరికి అవరమైన భోజనాన్ని కాజా టోల్‌ప్లాజా వద్ద సిద్ధం చేస్తున్నారు. అలాగే ప్రధాని పర్యటన పూర్తయిన తరువాత అక్కడే రాత్రి భోజనాన్ని కూడా అందించనున్నారు.

అధికార పార్టీ నాయకుల ఒత్తిడి

తెనాలిలోని టీడీపీ, జనసేన పార్టీ నాయకులతో ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను బస్సులలో ఎక్కించే బాధ్యతను ఆయా వార్డుల, గ్రామ ఇన్‌చార్జిలకు అప్పగించారు. తెనాలి పట్టణ పరిధిలో కూటమి నాయకుల కోసం 110, మండల పరిధిలో 26, కొల్లిపర పరిధిలో 52 బస్సులను ఏర్పాటు చేశారు. అయితే రాజధాని వెళ్లేందుకు ఎక్కువ మంది కూటమి పార్టీల నాయకులు విముఖత చూపుతున్నారు. చేసేదిలేక నాయకులు మున్సిపల్, మండల అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. కూటమి బస్సులలో కూడా డ్వాక్రా సంఘ సభ్యులను ఎక్కించాలని హుకుం జారీ చేస్తున్నారు. చేసేదిలేక అధికారులు వారికి కేటాయించిన బస్సులలో కూడా డ్వాక్రా సంఘ సభ్యులను ఎక్కించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మొత్తం మీద ప్రధాని పర్యటన డ్వాక్రా సంఘ సభ్యుల పాలిట శాపంగా మారిందని చెప్పవచ్చు.

నేటి నుంచి 'కిశోరి వికాసం'

- అంగన్‌వాడీ కేంద్రాల్లో వేసవి శిక్షణకార్యక్రమాలు
- ప్రణాళిక సిద్ధం చేసిన మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ

ప్రత్తిపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో సమ్మర్ సెలవుల్లో ఆయా గ్రామాల్లోని 11 నుంచి 18 ఏళ్ల వయస్సు గల కిశోర బాల, బాలికలకు వేర్వేరుగా 12 రోజుల పాటు రోజుకో అంశంపై శిక్షణ ఇవ్వనున్నారు. ట్రైనింగ్ ఫెసిలిటేటర్లుగా మహిళా పోలీస్‌లు, ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు వ్యవహరించనున్నారు. సంబంధించిన షెడ్యూల్‌ను మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు విడుదల చేశారు. మే 2వ తేదీన బాలికలు ఒకరినొకరు పరిచయం చేసుకోవడం, లక్ష్యాలు నిర్ధారించుకోవడం ఉంటుందని అన్నారు. మే 6న రుతుక్రమం, పరిశుభ్రతతో పాటు లైంగిక విద్య ఉంటుందన్నారు. 9న పునరుత్పత్తి ఆరోగ్యం, బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాలు తెలియజేస్తారు. 13న బాలల హక్కులు రక్షణ, పోక్సో చట్టంపై అవగాహన.. 16న కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు.. 20న ఆడపిల్లల పట్ల లింగ వివక్ష, అసమానతలపై అవగాహన కల్పించనున్నారు. 23న ఉన్నత విద్య, నైపుణ్యాలు, కెరీర్ మార్గదర్శకత్వం.. 27న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత, సమస్యలను ఎదుర్కోవడం.. 30న ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు తెలియజేస్తారు. జూన్ 3న కౌమార బాలికల నాయకత్వం, సాధికారత, జూన్ 6న శారీరక వ్యాయామం, క్రీడలు, ఆటల ప్రాముఖ్యత, జూన్ 10న బాల్య వివాహాలతో కలిగే దుష్ప్రభావాలు, నివారణ తరగతులు ఉంటాయన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలు



పోస్టర్లును ఆవిష్కరిస్తున్న ఎంఈవో రమాదేవి,

ప్రత్తిపాడు: ఆర్టీఈ చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచితంగా సీట్లు కేటాయిస్తున్నారని ఎంఈవో సీహెచ్.రమాదేవి అన్నారు. ఉచిత ప్రవేశాలకు సంబంధించి మే 2నుంచి ఈనెల 19వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జరుగుందని తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం మండల విద్యా వనరుల కార్యాలయంలో ఆమె సంబంధిత పోస్టర్లును ఆవిష్కరించారు. ఎంఈవో మాట్లాడుతూ.. విద్యా హక్కు చట్టం ప్రకారం 2025–26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 1వ తరగతిలో కేటాయించిన 25 శాతం ఉచిత ప్రవేశాలకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసిందన్నారు. 1వ తరగతిలో ప్రవేశాలకు ఏప్రిల్ 28 నుంచి జరగాల్సిన దరఖాస్తుల స్వీకరణ అనివార్య కారణాల వల్ల శుక్రవారం నుంచి మొదలవుతాయని అన్నారు. అర్హులైన విద్యార్థులు ప్రాథమిక వివరాలతో సిఎస్ఇ.ఎపి.జీవోవి.ఇన్ వెబ్ సైట్ లో మాత్రమే అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 1800 425 8599లో సంప్రదించాలన్నారు. సీఆర్పీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలతో ఆశీర్వాద కూడిక



ప్రార్థనలో పాల్గొన్న విశ్వాసులు

గుంటూరు రూరల్: దేవుడు ప్రతీ కుటుంబాన్ని ఆశీర్వదిస్తారని కృపా మినిస్ట్రీ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ మాథ్యూస్ తెలిపారు. ఏటా మే డే రోజున కృపా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరిగే కుటుంబ ఆశీర్వాద ప్రత్యేక ప్రార్థనా కూడిక మహాసభను గురువారం నల్లపాడు రోడ్డులోని మెట్టుమల్లారెడ్డి పొలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి, సభను ప్రారంభించారు. కార్యక్రమంలో కృపా మినిస్ట్రీస్ బ్రదర్స్, సిస్టర్స్ క్రీస్తు గీతాలను ఆలపించారు. బ్రదర్ మాథ్యూస్ దేవుడి వాఖ్యాన్ని విశ్వాసులకు అందించారు. క్రీస్తుని నమ్మిన కుటుంబాలను ఆయన ఆశీర్వదిస్తారన్నారు. కార్యక్రమంలో బ్రదర్ హోసన్న, స్థల యజమాని మెట్టు కృష్ణారెడ్డి, అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇరువురు ఆత్మహత్య

తెనాలిరూరల్: ఉరి వేసుకుని కూలీ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని అంగలకుదురు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎం. కోటేశ్వరరావు (45) కూలి పనులకు వెళుతుంటాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల నేపథ్యంలో బుధవారం రాత్రి ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అర్ధరాత్రి గమనించిన కుటుంబసభ్యులు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య పార్వతి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ కె. ఆనంద్ తెలిపారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

మరో ఘటనలో ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ పాత ఆర్టీసీ డిపో ఏరియాకు చెందిన తరణి సాయికుమార్ (26) ఒక్కడే అద్దె ఇంట్లో నివసిస్తుంటాడు. ఆటో నడిపే ఇతను మద్యానికి బానిసయ్యాడు. ఆర్థిక ఇబ్బందులు, మత్తుకు బానిసవడంతో గురువారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి అతని సోదరుడికి సమాచారమివ్వడంతో మృతదేహాన్ని పరిశీలించి వన్‌టౌన్ పోలీసులకు తెలిపాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి సహాయం

కాకుమాను: మండలంలోని కొండపాటులో ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న గడ్డిపాటి రాజమణి(45) గురువారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాకుమాను ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఎస్.రాజశేఖర్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమె భర్తకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన నగదును త్వరితగతిన వచ్చే విధంగా తన వంతు కృషి చేస్తానని కుటుంబ సభ్యులకు తెలిపారు.

విజ్ఞాన్ రిజిస్ట్రార్‌గా పీఎంవీ రావు బాధ్యతల స్వీకరణ

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా పీఎంవీ రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన పీఎంవీ రావు విజ్ఞాన్ యూనివర్సిటీలో గడిచిన 26 ఏళ్లుగా పనిచేస్తూ విశేషమైన సేవలను అందించారు. విద్యారంగంలో సుదీర్ఘ అనుభవం కలిగి, ఆధునీకరణ, పరిపాలనలో పారదర్శకత, విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యాలతో పని చేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. డాక్టర్ పీఎంవీ రావు మాట్లాడుతూ.. రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించడం ద్వారా తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, డీన్లు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై సమావేశం



వేమూరు: రైతులందరూ తమ పొలాలలో భూసార పరీక్షలు చేయించుకోవాలని బాపట్ల రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలో రైతులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మూడు పంటల తరువాత తప్పని సరిగా భూ సార పరీక్షలు చేయించుకోవాలన్నారు. సిఫారసు మేరకు ఎరువులు వాడకం చేపట్టాలని ఆయన సూచించారు. మండల వ్యవసాయాధికారి చందోలు సునీత మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు గ్రామ వ్యవసాయ అధికారులు ద్వారా చేయించుకోవాలని ఆమె తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలోని చౌడవరం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. చౌడవరం వద్ద గుర్తు తెలియని వ్యక్తి బైక్‌ను రోడ్డు పక్కన పార్క్ చేశాడు. అటుగా వెళుతున్న కారు మితిమీరిన వేగంతో వచ్చి బైక్‌ని ఢీకొంది. దీంతో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ద్విచక్రవాహనం పూర్తిగా ధ్వంసమైంది. వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండటంతో వివరాలు తెలియరాలేదని స్థానికులు తెలిపారు. సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని నల్లపాడు పోలీసులు అన్నారు.